
## బొర్రాగుహల అందాలు అద్భుతం


గుహలను తిలకిస్తున్న జస్టిస్ రవినాథ్ తిల్హారి

అనంతగిరి గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: బొర్రాగుహల సహజసిద్ధ అందాలు అద్భుతంగా ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జె. రవినాథ్ తిల్హారి అన్నారు. అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని పర్యటక ప్రాంతాలను మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అనంతగిరి మండలంలో కాఫీతోటలను పరిశీలించారు. అక్కడి నుంచి బొర్రాగుహలు సందర్శించారు. అక్కడి నుంచి హరితా హిల్‌రిసార్ట్స్‌కు పయనమయ్యారు. చాపరాయి జలవిహారిలో సంప్రదాయ నృత్యం థింసాతో గిరి మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా నృత్యాన్ని ఆస్వాదించారు. అనంతగిరి ఉప తహసీల్దార్ మాణిక్యం, ఆర్.ఐ. శంకరరావు, ఎస్.ఐ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 28 బోధనేతర (నాన్‌టీచింగ్) సిబ్బంది పోస్టులను పొరుగుసేవల ప్రాతిపదికన 2024-25 విద్యాసంవత్సరానికి భర్తీ చేయనున్నట్లు డీఈఓ పి.బ్రహ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన, అసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి ఈ నెల ఏడో తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గల మహిళ అభ్యర్థులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాలకు ఎంఈఓను సంప్రదించాలని ఆయన సూచించారు.

★ ఆశపెట్టి.. భయపెట్టి.. మోసాలు ★ చదువుకున్న వారికీ టోకరా

# సైబర్ వల.. ఖాతా గుల్ల



ఉద్యోగం అంటూ ఆశపెడతారు.. వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు అంటూ ఎరవేస్తారు.. తాము పోలీసులమంటూ బెదిరిస్తారు.. తియ్యటి మాటలతో యువతులు ట్రాప్ చేస్తారు. ఇలా ఎన్నో రకాలు సైబర్ మోసాలు అధికమవుతున్నాయి. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని లక్షలాది రూపాయలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే | ఈనాడు, పాడేరు

పోలీస్‌స్టేషన్లకు ఇది వరకు ఇళ్ల దొంగతనాలు, కొట్లాట, అత్యాచారం, హత్యాయత్నం కేసులు వచ్చేవి. ఇప్పుడు ఇవి తగ్గి సైబర్ నేరాల కేసులు అధికమయ్యాయి. అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సెప్టెంబరులో 7 సైబర్ నేరాల కేసులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది సైబర్ నేరగాళ్ల మాటల వలలో వడి డబ్బులు పోగొట్టుకుంటున్నా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడంలేదు.

సైబర్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఫిర్యాదులను పరిష్కరించడానికి జిల్లాకో సైబర్‌స్టేషన్ పెట్టాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేసింది.

ఒక పోలీస్ ఉన్నతాధికారి మాట్లాడుతూ జిల్లాకొకటి కాదు. డివిజన్‌కొక స్టేషన్ పెడితేనే గానీ కేసులు పరిష్కారం కాదని చెప్పారంటే ప్రస్తుతం భవిష్యత్‌లో సైబర్ నేరాలు ఎలా ఉంటాయోనన్న భయాందోళనలు అందరిలోనూ నెలకొంటున్నాయి.

**సెప్టెంబరు 5న** ▸▸ తుమ్మపాలకు చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి సైబర్ మోసానికి గురైనట్లు అనకాపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వాట్సాప్‌లో ఇతని నంబరు యాడ్‌చేసి గ్రూపులోని సభ్యులందరూ వ్యాపారం చేస్తున్నారని లాభాలు వచ్చాయని నమ్మించి రూ. 8.45 లక్షలు నగదు కాజేశారు.

**సెప్టెంబరు 6న** ▸▸ అనకాపల్లి గాంధీనగరానికి చెందిన వివాహితకు గూగుల్‌లో హోటల్స్ రేటింగ్స్ ఇవ్వడం ద్వారా నగదు సంపాదించొచ్చని ఆశ చూపారు. తొలుత రూ. 100 పంపితే తిరిగి రూ. 150 పంపారు. అలా నమ్మించి వివాహిత నుంచి రూ. 1.26 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు.

**సెప్టెంబరు 10న** ▸▸ అనకాపల్లికి చెందిన యువకుడి పేరుమీద మాదకద్రవ్యాలు పార్సిల్ వచ్చిందని సైబర్ నేరగాళ్లు పోలీసుల పేరుతో యువకుడికి ఫోన్ చేశారు. తమ విచారణలో మాదకద్రవ్యాలతో సంబంధిత యువకుడి ప్రమేయం ఉందని బెదిరించడంతో అతడు రూ. లక్ష పంపాడు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

**సెప్టెంబరు 12న** ▸▸ నమోదైన కేసులో తుమ్మపాలకు చెందిన యువకుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఇంటి వద్దనే ఉంటూ డబ్బులు సంపాదించొచ్చని, తాము పంపిన లింక్‌ను ఓపెన్ చేయాలని చెప్పడంతో దాన్ని ఓపెన్‌చేసి లావాదేవీలు చేశాడు. అలా చేస్తూ రూ. 5.68 లక్షలు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు.

**సెప్టెంబరు 14న** ▸▸ అనకాపల్లికి చెందిన యువకుడు అమెజాన్‌లో ఉద్యోగం కోసం ఆన్‌లైన్ పరీక్ష రాశాడు. ఇతనికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి ఉద్యోగంలో జాయిన్ కావాలంటే తాము పంపిన లింక్ ఓపెన్ చేయాలని చెప్పారు. అలా ఓపెన్ చేశాడు. యువకుడు బ్యాంకు ఖాతా నుంచి రూ. 1.85 లక్షలు కాజేశారు.


అనకాపల్లిలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**సెప్టెంబరు 15న** ▸▸ బ్యాంకు ఉద్యోగి నుంచి అధిక లాభాల వ్యాపారం పేరుతో వాట్సాప్ గ్రూపులోని సభ్యులతో కలిసి పెట్టుబడి పెట్టించినట్లుగా నమ్మించి రూ. 15.29 లక్షలు కాజేశారు. దంత వైద్యుడిని ఆర్మీ ఉద్యోగులకు వైద్యం అందించే పేరుతో, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దిల్లీ సైబర్ క్రైం పోలీసుల పేరుతో బెదిరించి డబ్బులు కాజేశారు.

**ఇలా అనకాపల్లిలో గత నెలలో ఏడు కేసులు. ఈ నెలలో ఒకటి సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి.**

### పోలీసులు బెదిరించరు..



సైబర్‌నేరగాళ్లు సులభంగా డబ్బులు వస్తాయని ఆశ చూపుతారు. ఇంటి వద్దనే ఉంటూ డబ్బులు సంపాదించొచ్చని నమ్మించడానికి కొంతనగదు లావాదేవీలు చేస్తారు. వీటికి మోసపోయి నగదు పోగొట్టుకుంటున్నారు. ఉద్యోగాల పేరుతో యువతకు ఫోన్‌చేస్తే నమ్మొద్దు. 'మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం.. మీపై కేసులు ఉన్నాయ'ని పోలీసులు ఎవరూ కాల్ చేయరు. అనుమానం ఉంటే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి వారికి వచ్చిన ఫోన్ నంబరు చూపించి వివరాలు తెలుసుకోవచ్చు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడి మాటలకు మోసపోయి నగదు పోగొట్టుకోవద్దు. – **విజయ్‌కుమార్, అనకాపల్లి పట్టణ సీఐ**

**సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, బ్యాంకు ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న యువతీ యువకులు చిక్కుకుని రూ.లక్షల్లో నగదు పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరాలను అరికట్టే చర్యల్లో భాగంగా అవగాహన సదస్సులు పెడుతూ చైతన్యం తీసుకొస్తున్నా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.**

## మండుతోంది ఎండ.. మాటలు వినేది ఎట్లా!


మినుములూరు పీహెచ్‌సీ ఎదుట మండుటెండలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమావేశం

పాడేరు, న్యూస్‌టుడే: మండుటెండలో సమావేశాలు పెట్టడం న్యాయమా అంటూ ఆశా కార్యకర్తలు అధికారులకు నిలదీశారు. పాడేరు మండలం మినుములూరు పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో సుమారు 200 మందికి పైగా ఆశా కార్యకర్తలు, 50 మంది వరకు వైద్య సిబ్బంది 50 ఈ సమావేశంలో పాల్గొన్నారు. మండుటెండలో సమావేశం నిర్వహించడంతో పలువురు ఆశా కార్యకర్తలు కళ్లు తిరిగి పడిపోయారు. మరి కొంత మంది తమ వెంట తెచ్చుకున్న గొడుగులు వేసుకుని సమావేశంలో చెప్పిన విషయాలు తెలుసుకోవాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు స్పందించి మినుములూరు పీహెచ్‌సీలో సమావేశాలకు భవనం నిర్మించాలని వీరంతా కోరుతున్నారు.







## పచ్చని అందాలు మన్యానికే మణిహారం

### ఎమ్మెల్యే శిరీషాదేవి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రకృతి అందాలు మన్యానికి మణిహారంగా నిలుస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. చాపరాయి జలవిహారిని కుటుంబ సమేతంగా ఆమె సందర్శించారు. ఇక్కడి అందాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చుట్టూ పచ్చని కొండల నడుమ జలపాతాలు మన్యానికే సొంతమన్నారు. ఉదయం మంచు, సాయంత్రం చల్లని గాలుల మధ్య కొండకోనల్లో జలపాతాలు ఆకట్టుకుంటున్నాయని ఆమె తెలిపారు. ఆమె జలవిహారి నిర్వాహకులతో సరదాగా సెల్ఫీలు తీసుకున్నారు. మన్యంలో పర్యటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.


చాపరాయి నిర్వాహకులతో ఎమ్మెల్యే శిరీషాదేవి

## అరకులోయలో 'ఎన్‌సీసీ' ట్రెక్కింగ్



మ్యాప్ పరిశీలిస్తున్న ఎన్‌సీసీ అధికారులు


విశాఖపట్నం, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి మొత్తం 450 మంది నేషనల్ క్యాడెట్ కార్ప్స్ మంగళవారం అరకులోయ ట్రెక్కింగ్ నిర్వహించారు. ఆంధ్ర డైరెక్టరేట్ బాలికల విభాగం కమాండింగ్ అధికారి గోపేంద్ర సారథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి 25 మంది ఆర్మీ అధికారులు హాజరయ్యారు. శిబిరంలో భాగంగా క్యాడెట్లు రజతజలపాతాన్ని సందర్శించారు. ఏపీ-తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బి.ఎం.రెడ్డి సాహస యాత్రలో పాల్గొన్నారు. శిబిరాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా తదితరులు సందర్శించారు. అరకులోయలో సాగిన ట్రెక్కింగ్ ఎంతో అనుభూతి ఇచ్చిందని క్యాడెట్లు సంతోషం వ్యక్తం చేశారు.



హాజరైన విద్యార్థులు

## అతివలూ.. అందిపుచ్చుకోండి

కస్తూర్బాల్లో ఉద్యోగాల దరఖాస్తుకు రేపు ఆఖరు




నక్కపల్లి, న్యూస్‌టుడే

కస్తూర్బా విద్యాలయాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు బోధించడానికి సీఆర్‌టీలు, ఇంటర్‌కు పీజీటీలు, పీఈటీలు అదేవిధంగా పార్ట్‌టైం టీచర్లు, బోధనేతర సిబ్బంది ఉంటారు. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీనికనుగుణంగా కార్యాచరణ చేపట్టిన ఉన్నతాధికారులు ఒప్పంద, పొరుగు సేవల విధానంలో ఏడాది ప్రాతిపదికన ఖాళీల భర్తీ కోరుతూ ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రిన్సిపల్, పీజీటీలు, సీఆర్టీలు, కంప్యూటర్, ఒకేషనల్, అకౌంటెంట్, వార్డెన్లు కలిపి 604 ఖాళీలను ప్రకటించారు. ఇందులో కొన్ని జిల్లాల్లో కొన్నిరకాల ఖాళీలు మాత్రమే ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో 24 కస్తూర్బా విద్యాలయాల్లో కలిపి 29 పోస్టులు ఒప్పంద, పొరుగు సేవల సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఇందులో పోస్టును బట్టి కనీసం రూ. 18వేల నుంచి గరిష్ఠంగా రూ. 34 వేలకుపైగా వరకు వేతనం ఇస్తారు. ఇందుకోసం అర్హత కలిగిన వారంతా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. గతనెల 26 నుంచి వెబ్‌సైట్ apkgbv.apcsff.in అందుబాటులోకి వచ్చింది. ఈనెల 10తో వీటికి గడువు ముగియనుంది. వెబ్‌సైట్‌లోకి వెళితే విద్యార్హతలు, వయసు గడువు తదితర వివరాలు ఇందులోనే కనిపిస్తాయి. కాగా జిల్లాలో ఈ ఏడాది అందుబాటులోకి రానున్న టైప్ 4 కేజీబీవీల్లో వార్డెన్ల నియామకానికి చర్యలు చేపట్టారు. జిల్లాలో నాలుగు వార్డెన్ పోస్టులు నూతనంగా భర్తీ చేస్తున్నారు.



కేజీబీవీ పాఠశాల



బోధనలో పీజీటీ

**జిల్లాలో ఖాళీలు ఇలా..**

| | |
|---|---|
| **బోధన** | |
| సీఆర్టీలు | 8 |
| పీజీటీలు | 7 |
| పార్ట్‌టైం టీచర్లు | 7 |
| **బోధనేతర** | |
| వార్డెన్లు | 4 |
| అకౌంటెంట్ | 3 |

**ప్రతిభ ఆధారంగానే..**



జిల్లాలో ఉన్న ఖాళీల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి. ఇవి కేవలం మహిళలకు మాత్రమే. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గడువులోగా సమర్పించాలి. కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ధ్రువపత్రాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈనెల 23 లోగా ప్రక్రియ పూర్తవుతుంది. 24న విధుల్లో చేరాల్సి ఉంటుంది.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈఓ

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: కలెక్టర్

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో 'పల్లె పండగ వారోత్సవాలను' ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రణాళికాయుతంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. అమరావతి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులు ప్రారంభించేందుకు పల్లె పండగ పేరుతో ఈ కొత్త కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా మొదలుపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు సీసీ రోడ్లు, తారు రోడ్లు వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

**చింతపల్లి ఎంపీడీఓకు షోకాజ్:** ఉపాధి హామీ పథకంలో సమీక్షలో భాగంగా చింతపల్లి మండలంలో తక్కువ పనులు జరగడానికి కారణాలపై సమీక్షించారు. అక్కడ ఒక పంచాయతీలో 1329 మంది జాబ్ కార్డులు తొలగించినట్లు గుర్తించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సంతలో ఆహార కల్తీపై మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది ఆహార నమూనాలు సేకరించి పరీక్షలకు పంపేలా శిక్షణ ఇవ్వడానికి అవకాశాలను పరిశీలించాలని జేసీని ఆదేశించారు. పీఎంఏవై కింద 33 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జేసీ ఎంజే అభిషేక్ గౌడ, డ్వామా పీడీ శివయ్య, డీపీఓ కొండలరావు, హౌసింగ్ పీడీ ఎన్.బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ రాకేశ్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

## మారేడుమిల్లిలో విస్తృతంగా వాహన తనిఖీలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఎవరైనా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సీహెచ్ గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో జిల్లాలోని విలీన మండలాలతోపాటు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు ఈ మార్గంలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. లోతట్టు ప్రాంతాల నుంచి భారీగా వాహనాలు తిరుగుతుంటాయి. ఈ క్రమంలో గంజాయి తదితర మత్తు పదార్థాల రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ఏఎస్సై ప్రకాశ్, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల

ఓ కన్సల్టెన్సీ గుట్టురట్టు



విద్యార్థులకు పత్రాలను అందజేస్తున్న ఎ.పి. విద్యార్థి నాయకుడు సమయం హేమంత్‌కుమార్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రైవేటు జాబ్ మేళా పేరుతో ఎన్నెల్ ప్లేస్‌మెంట్స్ అండ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ఎటువంటి కంపెనీలతో ఒప్పందం లేకుండానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలతో మోసం చేయడానికి ప్రయత్నించింది. విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం, పార్వతీపురం గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను ఉద్యోగం వచ్చిందని నమ్మించి ధ్రువపత్రాలు తీసుకుని నగదు కాజేసే ప్రయత్నం చేసింది. మంగళవారం ఉదయం విశాఖలోని దొండపర్తి ప్రాంతానికి వచ్చిన ఆయా ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గురించి తెలుసుకున్న ఎ.పి. నిరుద్యోగ జే.ఎ.సి. రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ స్వయంగా వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్యోగాలకు సంబంధించి ఎటువంటి హామీ లేదని, అంతా ఉత్తుత్తిదేనని తెలుసుకుని నిరుద్యోగులకు తెలిపి మోసపోకుండా నిలువరించారు. నిరుద్యోగులకు వారి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి జాబ్ మేళాకు ఒక తహసీల్దారును మేళాకు పర్యవేక్షణాధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నానని తెలిపారు.

## రంపచోడవరంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ఎటపాక, న్యూస్‌టుడే: ముంపు మండలాలను కలుపుతూ కొత్త జిల్లాను ఏర్పాటుచేసి, రంపచోడవరంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మండలంలో జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక సమావేశం మంగళవారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నికల సమయంలో రంపచోడవరంను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న గ్రామాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరారు. జాతీయ ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక చింతూరు డివిజన్ ఛైర్మన్ పీటర్ సింగయ్య, కార్యదర్శి వాడే రాంబాబు దొర, పాస్టర్లు జలకం భీమయ్య దొర, ఇర్పా ఇరమయ్య, ఇర్పా ఏసుబాబు, కె. కృపారావు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలతో మెరుగైన ఉద్యోగావకాశాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: యువత వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం ద్వారా వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ రోహిణి అన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం చింతపల్లి వైటీసీలో ఉద్యోగ మేళా జరిగింది. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, జి. మాడుగుల మండలాల నుంచి సుమారు 80 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడు ప్రైవేటు కంపెనీలు ప్రతిభ ఆధారంగా 28 మందిని ఎంపికచేసి వారికి నియామక ధ్రువపత్రాలు అందజేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సంగీత, ఈఎంఆర్ ప్రిన్సిపల్ సతీష్, ఎస్‌బీ ఏఎస్ఐ రమణమూర్తి పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థులతో అధికారులు

## సమన్వయంతో మన్యం అభివృద్ధి



కృష్ణారావు, రమేష్ నాయుడులను సన్మానిస్తున్న కూటమి నాయకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: టూరిజం, ట్రైకార్ సంస్థల సమన్వయంతో గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి మణికుమారి సూచించారు. ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, ఏపీటీడీసీ డైరెక్టర్ కె.వెంకట రమేష్ నాయుడులను మంగళవారం కూటమి నాయకులు సన్మానించారు. ఎంపీపీ కల్యాణి, కాంతమ్మ, నాయకులు చిట్టిబాబు, సురేష్‌కుమార్, ఆదినారాయణ, భీమన్న పిన్నయ్యపాల్గొన్నారు.

## కొండువలసకు సదుపాయాల కొరత

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ కొండువలస గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. భారీ వర్షాల కారణంగా గ్రామానికి వచ్చే రహదారి కోతకు గురవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యానికి గురైనవారిని ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ రావడానికి ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు చెప్పారు. పీవీటీజీ గ్రామాల్లో పీఎం జన్‌మన్ యోజన కింద మౌలిక వసతులు కల్పించాలని సురేంద్ర కోరారు. ఆయన వెంట సీపీఎం మండల నాయకులు, శరభన్న, నాగేష్ ఉన్నారు.



కొండువలస రోడ్డును పరిశీలిస్తున్న సురేంద్ర

## స్కూటీపై గంజాయి రవాణా

**పోలీసులకు పట్టుబడిన యువతీయువకులు**

చీడికాడ, న్యూస్‌టుడే: గంజాయి మత్తుకు అలవాటు పడిన ముగ్గురు యువతీయువకులు విక్రయించడమూ మొదలుపెట్టారు. కొన్నాళ్లుగా మన్యం నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. చీడికాడ మండలం మీదుగా స్కూటీపై గంజాయి తరలిస్తూ మంగళవారం పోలీసులకు చిక్కారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో వరహాపురం కూడలిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వస్తున్న ముగ్గుర్ని ఆపి తనిఖీ చేయగా.. రూ.75 వేల విలువైన 15 కేజీల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన ముగ్గురు చోడవరం గోవిందమ్మ కాలనీకి చెందిన సకిలేటి దుర్గాప్రసాద్, సిటిజన్ కాలనీకి చెందిన జయవరపు కిరణ్‌సాయి, కోటవీధికి చెందిన మళ్ల కీర్తిగా పోలీసులు గుర్తించారు. గంజాయితోపాటు స్కూటీ, సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితులను చోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు. వీరికి గంజాయి విక్రయించిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.



గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులతో పోలీసులు

## కాఫీ రైతుల సంక్షేమానికి ఐటీడీఏ కృషి

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యంలో కాఫీ రైతుల సంక్షేమానికి ఐటీడీఏ అన్ని విధాలుగా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ వస్తోందని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ అన్నారు. మంగళవారం చింతపల్లిలోని గిరిజన కాఫీ రైతుల పరస్పర సహాయ సహకార సంఘం (మాక్స్) ఆధ్వర్యంలో నెలకొల్పిన ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద కాఫీ విభాగానికి చెందిన అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులతో సమావేశం అయ్యారు. కాఫీ సహాయ సంచాలకులు అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఓ మాట్లాడారు. గతేడాది చింతపల్లి కేంద్రంగా నెలకొల్పిన మాక్స్ ద్వారా సుమారు 4,300 మంది గిరిజన రైతుల నుంచి 900 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేశామన్నారు. అప్పట్లో కేజీకి రూ. 43 చొప్పున ధర చెల్లించామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులతోపాటు మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు, సరైన నాణ్యత లేకపోవడం వంటి కారణాల వల్ల ఆశించిన లాభాలు రాలేదని చెప్పారు. అయినా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో కేజీకి అదనంగా రూ. 3 చొప్పున బోనస్‌గా చెల్లించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రైతులకు బోనస్‌గా సుమారు రూ. 24 లక్షలు త్వరలో అందిస్తామన్నారు. ఈ ఏడాది మాక్స్ ద్వారా రెండు వేల మెట్రిక్ టన్నుల పండ్లను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మన్యంలోని చింతపల్లి కేంద్రంగా నిర్వహిస్తున్న ఎకో పల్పింగ్ కేంద్రానికి మన్యంలోని 11 మండలాల నుంచి భాగస్వామ్యం ఉండేలా సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించామని చెప్పారు. త్వరలో గిరిజన సహకార సంస్థ ద్వారా అపెక్స్ కమిటీ సమావేశమై కాఫీకి గిట్టుబాటు ధరలపై ప్రకటన చేస్తుందన్నారు. చింతపల్లి ఎకో పల్పింగ్ కేంద్రంలో త్వరలో రూ. 6.5 లక్షల వ్యయంతో అదనంగా కొన్ని సదుపాయాలను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాఫీ సాగుతో గిరిజన రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ఐటీడీఏ లక్ష్యం నెరవేర్చేందుకు అంతా కృషి చేయాలని పీఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, డీపీఆర్ఓ రాములు, మాక్స్ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, ఉద్యాన శాఖ, కాఫీ విభాగాల అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్

## 59 సెల్‌ఫోన్ల అప్పగింత

పాడేరు, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి.. వాటి ఆచూకీ తెలుసుకుని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. పాడేరు ఎస్పీ కార్యాలయంలో మంగళవారం సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. చోరీకి గురైన ఫోన్ల ఐఎంఈఐ నంబర్ల ద్వారా అవి ఎక్కడున్నాయో ఆచూకీ తెలుసుకున్నారు. ఇలా 59 మొబైల్స్ పట్టుకుని, వాటిని ఎస్పీ చేతులమీదుగా పోగొట్టుకున్న వారికి అప్పగించారు. త్వరలోనే మరికొన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

## ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై తనిఖీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం, జె.వి.పాలెంలో మంగళవారం గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంగారమ్మపాలెంలో సముద్ర ఇసుక, జె.వి.పాలెంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీనిపై మైన్స్ ఏజీ వెంకటరమణ, ఆర్.ఐ. సత్యమూర్తి సిబ్బందితో కలిసి రెండు గ్రామాల్లో సముద్ర ఇసుక, గ్రావెల్ తవ్వేసిన ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. తవ్వకాలు ఎప్పుడు జరుగుతున్నాయి, ఎవరు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని ఆర్ఐ సత్యమూర్తి తెలిపారు.



బంగారమ్మపాలెంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

## విద్యుదాఘాతానికి భవాని భక్తుడి మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బవులవాడలో సోమవారం రాత్రి భవానీమాత పూజలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. గొలగాం గ్రామానికి చెందిన రోమాల సాయి, ఇతని తల్లి నాగలక్ష్మి భవానీ మాల వేశారు. బవులవాడలోని రాత్రి జరిగిన పూజకు వీరు వెళ్లారు. ఇక్కడ ఏర్పాటు చేసిన లైటింగ్ స్తంభానికి సాయి (19) ఆనుకుని కూర్చున్నాడు. ఈ సమయంలో విద్యుదాఘాతానికి గురికావడంతో అర్ధరాత్రి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి నాగలక్ష్మి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగలక్ష్మికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు సాయి తల్లి కళ్ల ముందే మృతి చెందడంతో ఈమె రోదిస్తున్న తీరు పలువురికి కలచివేసింది.



సాయి (పాతచిత్రం)

## లారీ, ఆర్టీసీ బస్సు ఢీ.. ముగ్గురికి గాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి వద్ద లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాకినాడ నుంచి విశాఖపట్నంకు 30 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వెళ్తోంది. నక్కపల్లి వీవర్స్ కాలనీ వద్ద రోడ్డుపై గేదె అడ్డు రావడంతో లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న బస్సు ఢీకొట్టింది. డ్రైవర్ కనకేశ్వరరావు, ప్రయాణికులు పద్మ, నాగలక్ష్మి గాయపడగా పోలీసులు వీరిని ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మిగిలిన ప్రయాణికులు వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు వెళ్లారు.

## చీమలపాడులో వైద్య శిబిరం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కిటుముల పంచాయతీ చీమలపాడులో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. సర్పంచి రమణమ్మ, కల్వరి బాప్టిస్టు చర్చి పాస్టర్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన ఈ శిబిరానికి అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చారు. వైద్యులు ఆనంద్‌మోహన్, రవికిరణ్, పద్మజ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు, కార్యక్రమంలో వనుము పోతురాజు, సుర్ల అప్పారావు, నాగరాజు, నర్సింగరావు, భాస్కరరావు పాల్గొన్నారు.



## మలేరియా నివారణపై అవగాహన అవసరం

హుకుంపేట, న్యూస్‌టుడే: మలేరియా, టైఫాయిడ్ జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన ఉంటే అవి రాకుండా జాగ్రత్త పడవచ్చని జిల్లా మలేరియా అధికారిణి తులసీ పేర్కొన్నారు. చట్రాయిపుట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లల బరువు చూశారు. స్థానిక వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త లేకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. బావులు నీటి ట్యాంకులు, గ్రావిటీ పథకాల్లో నీరు నిల్వ ఉంటే ప్రవేశాల్లో బ్లీచింగ్ జల్లించాలని పేర్కొన్నారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నివారణకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హుకుంపేట ఆసుపత్రిని సందర్శించి మలేరియా రికార్డులు పరిశీలించారు. మలేరియా అధికారి మోహన్‌రెడ్డి, శ్రీను శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



చట్రాయిపుట్టులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి

## నెల రోజులుగా పట్టని తుపాను వెతలు

సీలేరు, న్యూస్‌టుడే: తుపాను వచ్చి నెలరోజులు గడిచినా తమ ఇబ్బందులు చూసేందుకు ఒక్క అధికారి కూడా గ్రామానికి రాలేదని మండలంలోని గాలికొండ పంచాయతీ ఆకూలూరు గ్రామస్థులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలకు కొండచరియలు విరిగిపడి రహదారికి అడ్డంగా పడిపోయాయని, ఉన్న కొద్దిపాటి రహదారి కొట్టుకుపోయిందని వారు వాపోయారు. నెల రోజులుగా తాము పడుతున్న కష్టాలు వర్ణణాతీతమని, అత్యవసర రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామంలో 43 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి సరైన పాఠశాల భవనం లేదని పేర్కొన్నారు. పింఛనును నాలుగు కిలోమీటర్లు కాలి నడకన సప్పర్ల వెళ్లి తీసుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటివరకూ ఏ అధికారి తమ గ్రామానికి రాలేదని, మా గ్రామంలో ఒక్కరికి కూడా పంట నష్టపరిహారం జమకాలేదని తెలిపారు. పీఎం జన్‌మన్ కింద ఆదివాసీలకు ఇళ్లు మంజూరయ్యాయని చెప్పినా గ్రామంలో ఇప్పటివరకూ సర్వే జరగలేదని వారన్నారు. అధికారులు ఇప్పటికైనా గ్రామాన్ని సందర్శించి తమ కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆకులూరు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



ఆకులూరు గ్రామస్థులు

## భార్య నిలదీసిందని తాపీమేస్త్రి ఆత్మహత్య

రావికమతం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన తాపీమేస్త్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రావికమతం ఎస్సై రఘువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మేడివాడకు చెందిన గంటా కృష్ణ (36)కు పదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన దేవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే భర్త తాగుడుకు బానిసగా మారడంతో సోమవారం మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సమయంలో భార్య నిలదీసింది. కోపంతో కృష్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. వీరు నివాసం ఉండే ఇంటి పక్కన కోన సత్తిబాబుకు చెందిన పాత పెంకుటిల్లు ఉంది. దాన్ని తొలగించి కొత్తగా ఇల్లు కట్టుకోవాలని సత్తిబాబు ఆ పక్కనే మరో ఇంట్లో ఉంటున్నాడు. మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన కృష్ణ రాత్రి సమయంలో సత్తిబాబుకు చెందిన పెంకుటింట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం సత్తిబాబు భార్య లక్ష్మి పాత ఇంట్లో దూలానికి వేలాడుతున్న కృష్ణను చూసి భయంతో కేకలు వేశారు. చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రఘువర్మ సిబ్బందితో అక్కడకు చేరుకుని సర్పంచి లీలాశివ, కృష్ణ భార్య, తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## సారా బట్టీలపై దాడులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: చెరువూరు సమీపాన ఎస్సై సాధిక్ ఆధ్వర్యంలో పోలీసులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాధిక్ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు.

**చికెన్ ధరలు**

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 115 | 110 |
| లైవ్ | 137 | 130 |
| డ్రెస్‌డ్ | 199 | 230 |
| స్కిన్‌లెస్ | 226 | 240 |

## మూలకు చేరిన పథకాలు... తాగునీటికి ఇక్కట్లు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు ఆధారంగా తాగునీరు అందించేందుకు నిర్మించిన నీటి పథకాలు మూలకు చేరాయి. దీంతో సౌర ఫలకాలు, నీటి ట్యాంకులు గ్రామాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. 23 పంచాయతీల్లోని ఎనిమిది గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఆ గ్రామాల ప్రజలు ప్రస్తుతం కలుషిత ఊట నీరు వినియోగిస్తున్నారు. వనబసింగి పంచాయతీలోని కొత్తూరు, కరిముఖిపుట్టు పంచాయతీ నందిమెట్ట, దారెల పంచాయతీ గన్నెడ గ్రామాల్లో సౌర విద్యుత్తు నీటి పథకాలు పనిచేయక గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందిమెట్టలో గ్రామ సమీపంలో ఊట నీరు వినియోగిస్తున్నారు. నీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోనికి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా నీటిపథకం


చెట్టుకింద ఊటనీరు వినియోగిస్తున్న నందిమెట్ట మహిళలు

## యథేచ్ఛగా మట్టి దోపిడీ

ఎటపాక, న్యూస్‌టుడే: మట్టి తవ్వకాలను అరికడుతూ, అక్రమ రవాణాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. మేడువాయి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాల వెనుకాల ఉన్న ప్రభుత్వ భూమిలో గిరిజనేతరులు వందల కొద్దీ ట్రక్కులతో మట్టిని అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

## తాగునీరు లేదు.. సాగునీరు పారదు


వీఆర్‌పురంలో ఆయిల్ ఇంజిన్లతో పొలాలను సాగుచేసుకుంటున్న రైతులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే

విలీన మండలాలను రెండు నెలలు గడగడలాడించిన వరదలు ఎట్టకేలకు తగ్గినా అవిచేసిన గాయాల ప్రభావంతో ప్రజలకు మాత్రం ఇక్కట్లు తప్పడంలేదు. వరదలకు దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యం పునరుద్ధరిస్తున్నారు. ఇళ్లకు ఇబ్బంది లేకుండా విద్యుత్తు సరఫరా పునరుద్ధరించి, ప్రశంసలు అందుకున్న, ఆ శాఖ అధికారులు, సాగు, తాగునీటి అవసరాలు తీర్చే త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా పునరుద్ధరణలో శీతకన్నేశారు. జులై నెల చివరి వారం నుంచి నేటి వరకు వీఆర్‌పురం మండలం చిన్నమట్టపల్లి, పెద్దమట్టపల్లి, రామవరం, ములకనపల్లి, కుందులూరు పంచాయతీల్లో త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యంలేక, నీటి పథకాలు పనిచేయక, తాగునీటికి గ్రామాల్లో ప్రజలు చేతి పంపుల వద్ద క్యూ కడుతున్నారు. ఈ పంచాయతీల్లో దాదాపుగా 20 వరకు ప్రాథమిక పాఠశాలలు, సున్నంవారిగూడెంలో గిరిజన బాలుర, సోములగూడెంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ రెండింటిలో దాదాపుగా 500 మందికి పైగా విద్యార్థులు ఉంటారు. ఇక్కడ పథకాలు పనిచేయక నీటి వెతలు తప్పడంలేదు.

**పునరుద్ధరించని త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా**

మండలంలోని శబరి నదీ పరివాహక ప్రాంతంలో గున్నంకొండ నుంచి చొప్పల్లి వరకు దాదాపుగా 10 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి కింద రెండు వేల ఎకరాలపైన భూముల్లో అపరాలతోపాటు, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, వరి పంటలు సాగుచేస్తారు. ఈ లిఫ్టులకు అవసరమైన త్రీఫేజ్ విద్యుత్తు లైన్లు కూవనరం నుంచి శబరి నది, గుండంకొండ మీదుగా ఉన్నాయి. ఇటీవల వరదలకు ఈ లైన్లు ముంపునకు గురై కొన్ని స్తంభాలు నేలకొరిగాయి. మరోకొన్ని ఒండిపోయి.. తీగలు తెగిపోయాయి. వరదలు తగ్గడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. దుక్కులు దున్ని మిర్చి, పొగాకు మొక్కలు వేయడం ప్రారంభించారు. రోజురోజుకు భానుడి భగభగలతో వేసవి వాతావరణం నెలకొని వేసిన మొక్కలు బతికించుకోవడానికి కర్షకులు ఇక్కట్లు పడుతున్నారు. అన్నదాతలు వరి పంటకు నీటిని పెట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అదనపు ఖర్చుతో ఆయిల్ ఇంజిన్ల సాయంతో సాగు అవసరాలు తీర్చుకుంటున్నారు. లిఫ్టులు పనిచేస్తే, తమ పొలాలకు ఖర్చులేకుండా సాగునీటి సౌలభ్యం ఉంటుందని, విద్యుత్తు సంస్థ అధికారులు చొరవతీసుకుని త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ రాజ్‌కపూర్‌ని వివరణ కోరగా.. తాను రెండు రోజుల క్రితం బదిలీపై వచ్చానని, సమస్యను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తానని చెప్పారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతుల నిరసన

## అ వీ ఇ వీ

### రంపచోడవరం ఏఎస్‌వోగా విజయభాస్కర్

రంపచోడవరం, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖ ఏఎస్‌వోగా విజయభాస్కర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఏఎస్‌వోగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీహరి పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా బదిలీ అయ్యారు.

### పల్లె పండగతో సమస్యల పరిష్కారం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. జీకేవీధిలో మంగళవారం అధికారులకు ఈ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం మేరకు ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన వినతుల పరిష్కారానికి ఈ నెల 14 నుంచి పల్లె పండగ కార్యక్రమం ద్వారా పనులు ప్రారంభిస్తామన్నారు. ఉపాధిహామీ ఏపీవో అప్పలరాజు, పీఆర్ ఏఈ చల్లంగి రామ్‌ప్రసాద్, గృహ నిర్మాణ సంస్థ ఏఈ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో లైన్‌మెన్‌కు గాయాలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: జడ్డంగి - అమీనాబాద్ మార్గ మధ్యలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజవొమ్మంగికి చెందిన లైన్‌మెన్ రాంబాబుకు గాయాలయ్యాయి. జడ్డంగి వైపు వస్తున్న వ్యాన్, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రాంబాబు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన రాంబాబుకు జడ్డంగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు.

### సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

కొయ్యూరు, న్యూస్‌టుడే: యు.చీడిపాలెం గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఆ గ్రామ సర్పంచి డి.రమేష్ తెలిపారు. గొట్టెలపాడు, ఈదులబంద సమీపంలో వంతెనల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. పలకజీడి వారపుసంత, యు.చీడిపాలెంలోని గంగాలమ్మ గుడి వద్ద చేతిపంపులను ఏర్పాటు చేయాలన్నారు. ఈదులబందలో పాఠశాల భవనం, పలకజీడిలో ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు రమేష్ మంగళవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

### ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు తెలిపారు. మండలంలోని పాలమామిడిలో పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలకు తగినంత నిధులు ఉన్నాయని, ఇళ్లు పూర్తిచేసిన వారికి బిల్లులు సకాలంలో చెల్లిస్తామని తెలిపారు. సర్పంచి రామకృష్ణ, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### విస్తృతంగా తపాలా సేవలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గ్రామాల్లో తపాలా సేవలు విస్తృతం చేయాలని ఆ శాఖ పాడేరు డివిజన్ ఐపీవో వై. దిలీప్ అన్నారు. జి.మాడుగుల సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న 18 మంది బ్రాంచి పోస్టు మాస్టర్లతో (బీపీఎంలతో) మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. పోస్టాఫీసు పొదుపు పథకాలు, గ్రామీణ తపాల బీమా, సుకన్య సమృద్ధి యోజన సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాద బీమాపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీఎం ప్రసాద్, ఎంవోలు రవి, కిషోర్‌కుమార్, బ్రాంచీ పోస్టుమాస్టరు పాల్గొన్నారు.

## జగన్మాతా.. రక్షమాం..


సాయినగర్ వీధిలో దుర్గమ్మ మండపం వద్ద భక్తుల పూజలు


రంపచోడవరం స్టేట్‌బ్యాంకు సమీపంలో ఆలయంలో..


వట్టిగెడ్డలో..


జడ్డంగిలో అలంకరణ


మోతుగూడెంలో..


తోటపల్లిలో..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల్లో మంగళవారం దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గమ్మ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజవొమ్మంగి, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, దికిలిలి, తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దూసరపాముల్లో పురోహితుడు పి.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో భవానీ మాలధారులు గోపూజ చేశారు.

రంపచోడవరం: స్థానిక మార్కెట్‌వీధిలోని నూతన దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న దేవీ ఆలయాన్ని కమిటీ ప్రతినిధులు సుందరంగా తీర్చిదిద్దారు.

ఎటపాక, న్యూస్‌టుడే: తోటపల్లిలో మహాలక్ష్మి దేవి రూపంలో జగన్మాత భక్తులకు దర్శనమిచ్చింది. నెల్లిపాక, గుండాలకాలనీ, నందిగామ, లక్ష్మీపురం, బొదవరం, ఎటపాక గ్రామాల్లో నెలకొల్పిన మంటపాల్లోని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సీలేరు: జీకే వీధి మండలం దారకొండలో కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆదిసింహల్లో భక్తులు దర్శించుకున్నారు.

డుంబ్రిగుడ, పెదబయలు, చింతపల్లి/గ్రామీణం, న్యూస్‌టుడే: అరకు పంచాయతీ కేంద్రంలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. విజయదుర్గ పృథ్వేశ్వరిమాత మహోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధి సూరిక త్రివేది పేర్కొన్నారు. పెదబయలులోని వెలసిన దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. చింతపల్లి రంగా సెంటర్ వద్ద దుర్గమ్మ లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అంతర్లలోని రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు భారీగా పూజల్లో పాల్గొన్నారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బొయితిలి పంచాయతీ సారపల్లిలో శంఖమ్మ దేవతకు దుర్గమ్మను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. తెదేపా నాయకులు కె.భీంబాబు, కె.రమేష్, భూపతి భక్తులు పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: జెన్‌కో కాలనీలోని వనదుర్గ దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని నగదుతో అలంకరించారు.


చింతపల్లిలో లక్ష్మీదేవి అలంకరణలో దుర్గాదేవి


ధారకొండలో కరెన్సీ నోట్లతో అలంకరణ


పెదబయలులో ..


సారపల్లిలో గ్రామ దేవతకు పూజలు

### విద్యుత్తు సమస్యలపై సదస్సు నేడు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు డివిజన్‌లోని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం సీజీఆర్ఎఫ్ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఏఈ ఏవీఎన్ఎం అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే సదస్సులో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. సీజీఆర్ఎఫ్ కమిటీ అధ్యక్షులు, విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణతోపాటు జీసీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు హాజరుకానున్నారు.

### నేడు నిర్వాసితుల శాంతియుత నిరసన

దేవీపట్నం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలవరం నిర్వాసితులు బుధవారం శాంతియుత నిరసన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా దేవీపట్నంలో నిర్వాసితులు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ముంపు గ్రామాల నుంచి తమను తీసుకొచ్చి మూడేళ్లు దాటుతున్నా నేటికీ పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదన్నారు. కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి గోకవరం మీదుగా గంగాలమ్మ ఆలయం సమీంలోని దేవీపట్నం, పూడిపల్లి నిర్వాసితులకు నిర్మిస్తున్న పునరావాస కాలనీల వరకూ ర్యాలీగా శాంతియుత నిరసన చేపట్టనున్నామని బుర్రే ఆనందరావు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా రోడ్డున పడేసిందని విమర్శించారు.

## అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు


చింతూరులో మాట్లాడుతున్న డీఎఫ్‌వో బబిత

చింతూరు, న్యూస్‌టుడే: అడవి జంతువులపై వాత్సల్యం చూపిస్తూ, వాటిని వేటాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డీఎఫ్‌వో బబిత పేర్కొన్నారు. వన్య ప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం చింతూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణుల వేట మానుకోవాలని అలాంటి సంఘటనలు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వివిధ క్షేత్రాల సిబ్బందికి క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కూనవరం, లక్కవరం సబ్ డీఎఫ్‌వోలు రాఘవరావు, శ్రీనివాసరెడ్డి, రేంజ్ అధికారులు అబ్బాయి దొర, ముత్యాలయ్య, మూర్తి, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

### వన్య ప్రాణులను వేటాడొద్దు

కూనవరం, న్యూస్‌టుడే: వన్య ప్రాణుల సంరక్షణపై అందరికీ అవగాహన కల్పించాలని ఎఫ్ఆర్వో ఎం.కరుణాకర్ సూచించారు. వన్య ప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా కోతులగుట్టలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్య ప్రాణుల విలువలను ఆదివాసీలకు వివరించి వాటిని వేటాడకుండా చూడాలన్నారు. ఎంపీడీవో కేఆర్. విజయ, ఏపీవో శ్రీకాంత్, సత్యనారాయణ, భీమ్ సింగ్, జంపన్నరాజు, నాగలక్ష్మి, కాంతారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పర్యటక అభివృద్ధికి నిధులు కేటాయించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో పర్యటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరినట్లు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కుండ్ల రాజశేఖరరెడ్డి, మండల అధ్యక్షుడు పాపోలు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలో మంత్రి దుర్గేష్‌ను వారు కలిశారు. రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల మండలాల్లో పలు సుందరమైన ప్రాంతాలు ఉన్నాయని వీటిని అభివృద్ధి చేసి పర్యాటకులకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

### ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని ఆందోళన

రావికమతం: కొట్నాబిల్లి రెవెన్యూ పరిధిలో గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇచ్చే విషయమై బుధవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఎం నాయకులు, గిరిజనులు కె.గదబపాలెంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు-1లో 3.219 హెక్టార్లలో క్వారీ అనుమతులకు ఓ సంస్థ దరఖాస్తు చేసింది.

## మందుబాబులకు అడ్డాగా క్రీడా మైదానం


పాడేరు ప్రభుత్వ జూనియర్ క్రీడా మైదానంలో మద్యం సీసాలు

పాడేరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం మందు బాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లేక క్రీడా ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. గతంలో క్రీడా మైదానం అభివృద్ధికి సుమారు రూ. రెండు కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయి. గత ప్రభుత్వం పర్యవేక్షణ లోపంతో నిధులు దుర్వినియోగం అయ్యాయి. గతవారం ఓ గుత్తేదారు నిర్మాణ పనులకు సబంధించి కంకర తీసుకొచ్చి మైదానం వద్ద పోసి వదిలేశారు. క్రీడాకారుల ఇబ్బంది తెలుసుకుని ఎంపీడీఓ వెంటనే వీటిని తొలగించేలా చేపట్టారు. మందుబాబులు రాత్రి సమయంలో మందు తాగి మైదానంలోనే సీసాలు పడేస్తున్నారు. క్రీడాకారులు, ఉదయం నడకకు వచ్చే వారికి ఈ మద్యం సీసాలు కాళ్లను గుచ్చుకుని గాయపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఏకైక క్రీడా మైదానం నిర్వహణపై దృష్టి పెట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి


జాతీయ రహదారి పరిహారంపై సమీక్షిస్తున్న పీవో సింహాచలం, పక్కన సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-516ఇ నిర్మాణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం రంపచోడవరం డివిజన్‌లోని నాలుగు మండలాల్లో (రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి) జాతీయ రహదారి నిర్మాణంలో తలెత్తిన సమస్యలపై సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి పీవో సమీక్షించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఇళ్లు, చెట్లు, బోర్లు, ప్రభుత్వ భవనాలు తొలగించారని వీటికి సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ఇప్పటికే కొంతమందికి పరిహారం చెల్లించామని, మిగిలిన వారెంతమంది ఉన్నారో నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు కరక సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, డీటీలు రాజు, శ్రీధర్, సత్యనారాయణ, అటవీ రేంజి అధికారులు శ్రీనివాసరావు, సహేన్‌షా, డీఈలు సాయిసతీష్, రవీంద్రబాబు, మల్లికార్జునరావు, ఏఈలు, జేఈలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థలు సాయపడాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ కోరారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం కాకినాడకు చెందిన ఉమా మనోవికాస కేంద్రం (ఎన్‌జీవో) దివ్యాంగులకు పెళ్లి కానుక చెక్కులు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని దివ్యాంగులకు ఉమా మనోవికాస కేంద్రం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పెళ్లి చేసుకున్న 15 మంది దివ్యాంగులు ఒక్కొక్కరికి రూ.అయిదు వేలు చొప్పున, మరో ఐదుగురికి రూ.10 వేలు చొప్పున చెక్కులు ఇచ్చినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. సంస్థ ప్రతినిధి ఎన్ఏ నాయుడు, రాంజీ, చిన్ని, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు చెక్కులను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

## దోమతెరల వినియోగంతో జ్వరాలు దూరం


ఎటపాకలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలని రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు సుష్మ, ముఖర్జీ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సుష్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాలను ప్రతి రోజు సందర్శించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, ఎస్‌యూవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాకలో నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష్ పర్యవేక్షణలో మంగళవారం ఇంటింటికీ ఫీవర్ సర్వే చేపట్టారు. బాలింతలు, గర్భిణులకు పరీక్షించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్, ఫైలేరియా తదితర వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు పార్వతి, తిరుపతమ్మ, సీహెచ్ఓ లలిత, ఆరోగ్య సహాయకుడు గంగరాజు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

**పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172**

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: రంపచోడవరం సాయినగరంలో వీధి కొళాయిల పైపులైన్లు పగిలిపోయి నీరంతా రహదారిపై పారుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

– పి.వెంకటేశ్వరరావు, సాయినగరం

✓: సాయినగరంలో పగిలిపోయిన పైపులైన్లకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగిస్తాం.

– నారాయణ, పంచాయతీ కార్యదర్శి, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలసలో నిర్మించ తలపెట్టిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. అధికారులు స్పందించి, సచివాలయ భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలి.

– రత్నరాజు, జీఎంవలస

✓: గుజ్జుమామిడివలసలో గ్రామ సచివాలయ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం.

– వీరకిశోర్, ఎంపీడీవో, మారేడుమిల్లి

?: మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని పాములమామిడి, గుండ్రాతి వెళ్లే రహదారి అత్యంత అధ్వానంగా మారింది. వాహనాలు వెళ్లే ఆస్కారం లేక ఇబ్బందులు పడుతున్నారు.

– రవీంద్రరెడ్డి, పాములమామిడి

✓: పాములమామిడి, గుండ్రాతి వెళ్లే రహదారిని పునర్నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– వెంకటరమణ, మండల ఇంజినీరింగు అధికారి, మారేడుమిల్లి

## చిరుధాన్యాల సాగుతో ఆర్థికాభివృద్ధి

పెదబయలు/గ్రామీణం, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రసాయన ఎరువులు వాడకుండా, కేవలం జీవ ఎరువులతో చిరుధాన్యాల సాగు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని పెదబయలు వ్యవసాయాధికారి శ్రీనివాస్ రైతులకు సూచించారు. పెదబయలు మండలం అరడకోట, సీకరి పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతరించిపోతున్న చిరుధాన్యాలైన సామలు, కొర్ర, ఆండ్రుకొర్ర తదితర వాటిని సాగు చేయాలని చెప్పారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలని, మట్టిన మూనాల వివరాలు రైతుల సెల్‌ఫోన్‌కు పంపిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ డైరెక్టర్ వి.సన్యాసి, వ్యవసాయ సహాయకులు చెండా గౌతమి పాల్గొన్నారు. అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీలో వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి నేతృత్వంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాల్లోకి వెళ్లి కలుపు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పశు వైద్యాధికారి సందీప్ వైద్య శిబిరం నిర్వహించి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గీత, దేముడు పాల్గొన్నారు.

కొయ్యూరు: పంటలకు అవసరం మేరకే రసాయనిక ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారిణి ఉమాదేవి అన్నారు. రాజేంద్రపాలెం, కొత్తవీధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పంట పొలాలు పరిశీలించారు. ఎకరా వరికి 75 కేజీల యూరియా వేస్తే సరిపోతుందన్నారు. సర్పంచి సింహాచలం, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


గుమ్మలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది

### ఆశ్రమాల్లో ఏఎన్ఎంలను నియమించరూ..

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత సమస్యలపై ఆదివాసీ హక్కుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ పింజరకొండ, పనుకురాతిపాలెం గ్రామాలకు రోప్‌వే ద్వారా వంతెనను నిర్మించి గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఆదివాసీ నాయకులు గొర్లె నారాయణ, వాసా సత్యనారాయణ, సరమండ ఆదియ్య, మొల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.